ప్రమాదకర మలుపులతో ప్రమాదాలు


కాండ్లవాగు మలుపు వద్ద ఉన్న చెట్లు


మాధవరంలో మలుపు వద్ద లేని సూచిక బోర్డు

తాళ్లూరు: మండలంలోని మాధవరం గ్రామంలో ప్రమాదకరపు మలుపులుతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాండ్లవాగు వద్ద రోడ్డు వెంబడి ఉన్న చెట్లు దట్టంగా ఉండడం, అలాగే ఎత్తుగా గడ్డి పెరగడంతో ఈ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు మండల కేంద్రానికి అధికారులు ,ప్రజాప్రతినిధులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికి పట్టించుకునేనాథుడు కరువయ్యారని వాహనదారులు వాపోతున్నారు. కనీసం ఈ మలుపులు వద్ద డైరక్షన్ బోర్డులు పెట్టి ఆలోచనలో ప్రభుత్వం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే సంబంధించిన అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా దట్టంగా ఉన్న పిచ్చిచెట్లు తొలగించి డైరక్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు వాహనదారులు కోరుకుంటున్నారు.

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన నాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. దేవాలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

గంగమ్మ తల్లికి పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జున స్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయంలో పుస్తకాలతో విద్యార్థులు

ముండ్లమూరు(దర్శి): బాపట్ల జిల్లా జనవిజ్ఞాన వేదిక ఎన్విరాన్మెంటల్ కన్వీనర్ మన్నం త్రిమూర్తులు శంకరాపురం గ్రామంలో భగత్ సింగ్ స్మారక గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. బాల బాలికలకు ఉపయోగపడే పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. స్థానికుడైన మందలపు లక్ష్మీనారాయణ తన ఇంటిని అద్దె లేకుండా కొంతకాలం పాటు గ్రంథాలయానికి ఇచ్చారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ బాధ్యులు గాలి వెంకటేశ్వర్లు, తంగా శ్రీనివాసరావు, బొమ్మతోటి రాజా రమేష్, అద్దంకి ప్రసాద్, గంగినేని అలేఖ్య, స్థానికులు బాలబాలికలు పాల్గొన్నారు.

గుడి గోపురంపై పిడుగు


ధ్వంసమైన గోపురం

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పిడుగులతో కూడిన వర్షం పడింది. ముటుకుల గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న పొలంరాజు మఠం గోపురంపై ఆదివారం పిడుగు పడింది. దీంతో గోపురం తూర్పు భాగం దెబ్బతిని రాళ్లు కింద పడిపోయాయి. ముటుకుల గ్రామానికి చెందిన గోనిపల్లి పోలంరాజు దైవ సంబోధులుగా ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితం. ఆయన ఈ మఠంలో జీవసమాధి కావడంతో వందల సంవత్సరాలుగా ఈ ఆధ్మాత్మిక కేంద్రంగా పేరుగాంచింది. సుమారు 60 సంవత్సరాల క్రితం ఈ గోపురాన్ని నిర్మించినట్లుగా నిర్వాహకులు తెలిపారు. గోపురం దెబ్బతిన్న భాగాన్ని అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భూమికి బలం.. రైతుకు ఫలం

- పచ్చిరొట్ట ఎరువుతో ఎన్నో ప్రయోజనాలు
- రైతులకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చులు


కొచ్చెర్లకోటలో సాగు చేసిన పచ్చిరొట్ట పైరు

దొనకొండ: రైతన్నలకు నేడు సాగు అంటేనే ఖర్చుల భారం అన్నట్లు పరిస్థితి నెలకొంది. రైతులు రసాయనిక ఎరువులు వాడకాన్ని పెంచటంతో భూమిలో సారం పూర్తిగా తగ్గి పోతుంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగి పోతున్నాయి. దిగుబడులు కూడా తగ్గుతున్నాయి. రైతు సోదరులు పచ్చి రొట్ట ఎరువు సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. పచ్చిరొట్ట సాగు చేయడానికి ప్రభుత్వం రాయితీపై జీలుగలు, పిల్లి పెసర, జనుము విత్తనాలు అందజేశారు. ఎకరాకు 10 కేజీల చొప్పున పొలాల్లో చల్లి నెల రోజుల తర్వాత ఏపుగా పెరిగిన పచ్చిరొట్టను ట్రాక్టర్‌తో తొక్కించి భూమిలో కలిపేలా దుక్కి దున్నాలి. దీంతో పచ్చిరొట్ట కుళ్లి భూమిలో ఇంకి పోతుంది. వారం రోజుల తర్వాత గొర్రు, గుంటక, రోటావేటర్‌తో భూమి శుభ్ర పరిచి పంట సాగు చేసుకోవాలి. అలా చేస్తే రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. భూమిలో పోషకాల శాతం పెరుగుతుంది. అంతేకాకుండా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులకు పెట్టుబడుల భారం నుండి కొద్దిమేర ఉపశమనం కలుగుతుంది. రైతులు ఈ పద్ధతిని పాటిస్తే నత్రజని, భాస్వరం, పొటాష్‌లు సేంద్రియ రూపంలో భూమిలో కలిసి పోతాయి. రైతులకు కొద్దిమేర ఉపశమనం, చైతన్యం కలిగి పచ్చిరొట్ట విత్తనాలను ప్రతి ఏడాది భూమిలో చల్లుకుంటారు. పచ్చిరొట్ట ఎరువులు వాడటం వలన మొక్కలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు అందిస్తాయి. అంతేకాకుండా సూక్ష్మ జీవుల శాతం పెరుగుతుంది. దీంతో మొక్కలు దృఢంగా ఉంటాయని వ్యవసాయ అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

కాపాడండయ్యా నన్ను..!


ప్లాస్టిక్ డబ్బాలో తలదూర్చిన కుక్క

యర్రగొండపాలెం: పాపం శునకరాజుకు అనుకోని కష్టం వచ్చి పడింది. ప్లాస్టిక్ డబ్బాలో తల దూర్చి అన్నపానీయాలు లేక శునకం తీవ్ర ఆవేదనకు గురైంది. ఈఘటన స్థానిక కొలుకుల రోడ్డులోని చెత్త డంప్ వద్ద జరిగింది. ఆ ప్రాంతంలో సంచరించే ఒక కుక్క ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న ఆహారాన్ని తినేందుకు తల దూర్చింది. తిరిగి ఆ డబ్బాలో నుంచి తల బయటికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గత వారం రోజులుగా దానికి కనీసం నీళ్లు తాగే అవకాశంలేక పోవడంతో ఇబ్బందులకు గురైంది. ఈ విషయాన్ని గమనించిన ఆ ప్రాంతానికి చెందిన కొంతమంది ఆ డబ్బాను తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ కుక్క భయంతో పరుగులు తీస్తుండటం, అది ఎక్కడ కరుస్తుందో అన్న భయంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ కుక్కకు మచ్చికైనవారు వెంటనే తలకు ఉన్న డబ్బాను తొలగించి దానిని విముక్తి చేయాలని ఆ ప్రాంతం వారు కోరుతున్నారు.

పొలం తగాదాలతో వ్యక్తిపై దాడి


నాగయ్యను 108లో తీసుకెళ్తున్న సిబ్బంది

దొనకొండ: అన్నదమ్ముల పిల్లలకు పొలం తగాదాలతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని రుద్రసముద్రం సబ్ స్టేషన్ వద్ద మార్కాపురం–కుంటకు వెళ్లే రహదారి పక్కన ఆదివారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని మల్లంపేట పంచాయతీ పరిధి వల్లపునేనిపల్లె గ్రామానికి చెందిన మంచాల పున్నయ్య, మంచాల కోటయ్య ఇద్దరు అన్నదమ్ములు. గత కొన్ని సంవత్సరాల నుంచి పొలాల విషయంలో మనస్పర్థలు పెరిగి ఘర్షణకు దారితీశాయి. ఈ క్రమంలో భాగంగా పున్నయ్య కుమారుడు నాగయ్య 6 నెలల నుంచి మార్కాపురంలో నివాసం ఉంటున్నాడు. ట్రాక్టర్‌తో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రుద్రసముద్రం గ్రామానికి వచ్చి పొలం దున్ని వెళ్తుండగా కోటయ్య కుమారులు నాగయ్య, బాలరాజు, పెద్ద నాగయ్య, నడిపి నాగయ్య దారిలో కాపు కాసి ట్రాక్టర్‌కు బైకు అడ్డం పెట్టి పున్నయ్య కుమారుడు నాగయ్యను తీవ్రంగా గాయపరిచారు. అతని దగ్గర ఉన్న డబ్బులు తీసుకుని పరారయ్యారు. గాయపడిన నాగయ్యను దారిలో వెళ్లే వారు గమనించి 108కు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ టి.త్యాగరాజును సమాచారం అడగగా.. ఇప్పటి వరకు నా దగ్గరికి ఎవరూ రాలేదని తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

గిద్దలూరు రూరల్: కోతుల దాడిలో మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్ద సంఖ్యలో కోతుల సమూహం గ్రామంలోకి ప్రవేశించి ఇంటి వద్ద ఉన్న అంబటి వీరమ్మ అనే మహిళపై దాడికి పాల్పడ్డాయి. దీంతో ఆమెకు మోకాలి వద్ద బలమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా గత నెల 27వ తేదీన గ్రామంలో షేక్ సైదమ్మ, ఆకుల రమణమ్మ అనే ఇద్దరిపై కోతులు దాడి చేయడంతో కాళ్లు, చేతులపై తీవ్రగాయాలయ్యాయి. కోతులను కట్టడి చేసి రక్షణ కల్పించాలని పంచాయతీ సిబ్బందికి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోతుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాతృభూమిపై భక్తి, త్యాగం ఉండాలి


త్రిపురాంతకం ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘటన కార్యదర్శి విజయాదిత్య

త్రిపురాంతకం: మాతృభూమి పట్ల భక్తి, త్యాగం, కృతజ్ఞతా భావం కలిగి ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి విజయాదిత్య పేర్కొన్నారు. త్రిపురాంతకంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా ప్రసంగిస్తూ దేశంలో 1925 విజయదశమి నాడు ప్రారంభించిన ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలను పూర్తి చేసుకుందన్నారు. సమాజాన్ని సంఘటితం చేసేందుకు సంఘం పని చేస్తుందన్నారు. భారతీయులు బలహీనతలు, అనైక్యతను విడనాడాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో నిత్య శాఖ ద్వారా ఇవన్ని సాధ్యమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దేశ సౌభాగ్యం కోసం పనిచేస్తున్న సంస్థగా ఆయన పేర్కొన్నారు. సమాజంలో పంచ పరివర్తన్ ద్వార సంఘం మార్పు చేసేందుకు ప్రయత్నం ప్రారంభించిందన్నారు. గ్రామస్థాయిలో పంచపరివర్తన్‌లో భాగంగా సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌర విధులకు ప్రాధాన్యత ఇచ్చారని విజయాదిత్య వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈవో టి రాజశేఖర రెడ్డి, ఎంపీటీసీ సామాజిక కార్యకర్త పి కృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు నాగబ్రహ్మాచారి, విశ్వేశ్వరరావు, రమేష్, నాగిరెడ్డి, రమణారెడ్డి, మల్లికార్జున్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట మహోత్సవం


వాసవీమాతను దర్శించుకుంటున్న భక్తులు

గిద్దలూరు రూరల్: దేవీ శరన్నవ రాత్రి వేడుకల ముగింపు సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శేష పాన్పుపై ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై సామూహిక కోలాటం ప్రదర్శిస్తూ కుసుమ హరనాథస్వామి ఆలయం వరకు వెళ్లారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

గ్రామ దేవతలకు బోనాలు


తర్లుపాడులో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

తర్లుపాడు: స్థానిక బీసీ కాలనీ మహిళలు ఆదివారం గ్రామ దేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మ తల్లులకు బోనాలు సమర్పించారు. కుంకుమ బండి కట్టి బీసీ కాలనీ నుంచి సంబరం చేసుకుంటూ గుడి వద్దకు చేరుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. తర్లుపాడుతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


నాగులవరం జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు


బేస్తవారిపేట : గురువులతో సిద్దార్థ స్కూల్ పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో 2004లో పదో తరగతి చదువుకున్న వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా సందడి చేశారు. 21 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. చిన్ననాటి సంగతులు నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్య నేర్పిన గురువులు విజయభాస్కర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కృష్ణ, సుబ్రహ్మణ్యం, గఫార్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు మద్దుల విజయ్‌కుమార్‌రెడ్డి, కె.అశోక్‌కుమార్, ఓ.రవికుమార్, పి.వెంకటేశ్వరరెడ్డి, కె.సుబ్బారావు, ప్రియాంక, శివపార్వతి నేతృత్వం వహించారు.

అర్ధవీడు: మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. తరగతి గదుల్లో చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఈ అపూర్వ కలయికకు అర్ధవీడు మండలంలోని నాగులవరం జెడ్పీ హైస్కూలు వేదికగా మారింది. హైస్కూల్లో 1993–94, 1994–95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం నాడు కలుసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులంతా హాజరై సందడి చేశారు. నాటి హెచ్ఎం గాదం పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, రాజేశ్వరి, మేరిజాగు, తిరుపతిరెడ్డి, ఐ.తిరుపతయ్యను ఘనంగా సన్మానించారు.